అమరుల త్యాగాలు మరువలేం

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- మూడో రోజు ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- మాతృదేవోభవ ఆశ్రమంలో అనాథలకు పండ్లు పంపిణీ
- ఉద్యమ కారులకు సన్మానం

బడంగ్‌పేట, జూన్ 3: ప్రతి ఒక్కరూ అనాథలను అక్కున చేర్చుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలో ఉన్న వారితో కాసేపు మాట్లాడారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ అమరుల త్యాగాలను మరవలేమన్నారు. కేసీఆర్ పిలుపు మేరకు అనాథ ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేయాలని సూచించడంతో ఈ కార్యక్రమం చేశామన్నారు. ఇలాంటి వారిని చేరదీసి ఆశ్రమం కల్పించడం గొప్ప విషయమన్నారు. సమాజ సేవ చేయడానికి అందరికీ అవకాశం రాదన్నారు. ఆశ్రమానికి చేయూత నివ్వాలన్నారు. స్థలం కోసం ప్రయత్నం చేద్దామన్నారు. ఏదో రకంగా సహాయం చేస్తానన్నారు. సొంత భవనంలో కార్యక్రమాలు చేసుకుందామని తెలిపారు. అనాథ పిల్లలను ఆదుకోవాలన్నారు. ఎక్కడో రోడ్ల పై తిరుగుతున్న వారిని చేరదీసి ఆశ్రమం కల్పిస్తున్న గిరిని ఆమె అభినందించారు. ఇలాంటి అవకాశాలు భగవంతుడు కొందరికే కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ నర్సింహ రెడ్డి, మాతృదేవో భవ అనాథ ఆశ్రమం చైర్మన్ గిరి, రామిడి రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి లక్ష్మారెడ్డి, జంగయ్య, తదితరులు ఉన్నారు.

కందుకూరులో...

కందుకూరు: రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమ కారుల సేవలు మరువలేనివని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన కాకి నర్సింహ, బీఆర్ఎస్ మండల మహిళా మాజీ అధ్యక్షురాలు జైత్వారం గ్రామానికి చెందిన శేరిగూడం జయమ్మ రాజు, కొత్తూరు గ్రామానికి చెందిన హరికిషణ్ లాల్, రాచులూరు గ్రామానికి చెందిన రమేశ్‌చారి, పద్మమ్మ, గూడూరు గ్రామానికి చెందిన అందుగుల క్రిష్ణ, శ్రీకాంత్ గుప్త,కందుకూరు గ్రామానికి చెందిన ఎండీ ఎలియాస్‌లతో పాటు అనేక మంది ఉద్యమ కారులను ఆహ్వానించి శాలువాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యమకారులను సన్మానించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఉద్యమ కారుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, ఉద్యమ కారులు పాల్గొన్నారు.

మాతృదేవో భవ అనాథ ఆశ్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఉద్యమకారుడు బిరుడు చందర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ఉద్యమకారుడు నర్సింహకు సన్మానం..

తెలంగాణ అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే

ఏరియా దవాఖానలో పండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం ఏరియా దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 3 : పోరాడి సాధించుకున్న తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వనస్థలిపురంలో నిర్వహించారు. ఏరియా దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా తెలంగాణ నిలిచిందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీల ద్వారా కోట్లాదిగా నిధులు తీసుకువచ్చామన్నారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణంలో ఉందన్నారు. మరి కొన్ని ఫ్లైఓవర్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్ల రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, మాధవరం నర్సింహరావు, సుమన్‌గౌడ్, మధుగౌడ్, సామ బుచ్చిరెడ్డి, శివశంకర్, సత్యం చారి, సంజయ్‌కుమార్, ఖైసర్, మిట్టా రామ్మోహన్, అజయ్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అద్భుత ప్రగతి

జిల్లా పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, జూన్ 3 : మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో పది సంవత్సరాల్లో అద్భుత అభివృద్ధిని సాధించుకున్నామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం అమరులైన వారి త్యాగం ఎప్పటికీ మరువలేదని అన్నారు. అమరుల ఆశయ సాధన కోసం ప్రజలందరూ ముందుకు నడవాలని సూచించారు. ప్రజలందరికీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కందుకూర్ మండల పార్టీ అధ్యక్షులు మన్నే విజయందర్, కందుకూర్ ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్త, సీనియర్ నాయకులు న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల అరవింద్ కుమార్, జగన్మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, రిషి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ ముగింపు వేడుకలు

సైదాబాద్, జూన్ 3 : యాకుత్‌పురా నియోజకవర్గం పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు రోగులకు పేదలకు పండ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరవీరుల త్యాగంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, వీరులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించి, అభివృద్ధి చేసిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ సదన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్ రెడ్డి, సంతోష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సాబేర్, ప్రవీణ్, శివ, కార్తీక్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.


పండ్లు పంపిణీ చేస్తున్న ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్‌రెడ్డి

ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

వనస్థలిపురం: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ యూత్ జిల్లా ఇన్‌చార్జి మాధవరం నర్సింహరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సేఫ్ చారిటబుల్ ట్రస్టులో అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూత్ నాయకులు పాశం శ్రీధర్, కావేటి రమేశ్, సింగిడి నవీన్ కుమార్, నర్రా ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, మల్లి కార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సహారాస్టేట్స్‌కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతనంగా ఎన్నికైన సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ కార్యవర్గంతో కాలనీవాసులు

మన్సూరాబాద్, జూన్ 3: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీ మెయింటెనెన్స్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో వెంకటాద్రి ప్యానెల్ ఘనవిజయం సాధించింది. 21 మంది సభ్యులకు గాను జరిగిన ఎన్నికల్లో 17 మంది వెంకటాద్రి ప్యానెల్ నుంచి.. నలుగురు కరణం శ్రీకాంత్ ప్యానెల్ నుంచి విజయం సాధించారు. నలుగురు కార్యవర్గసభ్యులుగా గెలిచారు. అధ్యక్షుడిగా సయ్యద్ జానీ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస రావు, మేకల ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, కోశాధికారిగా శేఖరయ్య, సంయుక్త కార్యదర్శులుగా భీమానాయక్, మంజుల, కార్యవర్గసభ్యులుగా కోట్ల శ్యాంప్రసాద్, జ్యోతి, తృప్తి అగర్వాల్, విజయలక్ష్మి, కవిత, లత, వెంకటేశ్వరరావు, క్రిష్ణారెడ్డి, శ్రీనివాస్, మంగమ్మ, ఏవీ రావు, రమ, అమర్‌నాథ్, నర్సింహగౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గంగదాసు క్రిష్ణారెడ్డి, సాయిరాం, సురేందర్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గసభ్యుల చేత సహారాస్టేట్స్‌కాలనీలోని క్లబ్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల ప్రధాన అధికారి నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, మాజీ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, మాజీ కోశాధికారి జగత్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కాలనీవాసులు వెంకటాద్రి, శీనయ్య, కన్నా మహేశ్, పెంటయ్య, రామన్న, ప్రసాద్ రావు, డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

మన్సూరాబాద్, జూన్ 3: ఆరోగ్య సమస్యలతో మనోవేదనకు గురైన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్‌లోని ఇందు అరణ్య పల్లవి అపార్ట్‌మెంట్స్‌లో లక్ష్మీనర్సింహం కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. తల్లి నాగమణి (71) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత తాము నివాసముండే ఇందు అరణ్య పల్లవి అపార్ట్‌మెంట్స్‌లోని రెండో అంతస్తు నుంచి కిందకు దూకింది. గాయపడిన నాగమణిని చికిత్స నిమిత్తం నాగోల్‌లోని సుప్రజ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. తన మృతితో ఎవరికి సంబంధం లేదని.. కుటుంబసభ్యులు తనను మంచిగా చూసుకుంటున్నారంటూ ఆమె రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరోగ్య సమస్యలతోనే తన తల్లి మృతి చెందిఉంటుందని కుమారుడి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పౌరాణిక పద్య నాటక ప్రదర్శన

ఆర్కేపురం, జూన్ 3 : ఆర్కేపురం డివిజన్‌లోని ఇన్‌కమ్‌టాక్స్ కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణాపురం కాలనీలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. నటీనటులు తమ నాటకా కౌశలంతో ముఖ్యంగా పద్యాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఇందులో పాల్గొన్న నటీనటులు దుర్యోధనునిగా కొట్టె వెంకటచార్యులు, శ్రీకృష్ణుడిగా సూలపాణి, గాంధారిగా సావిత్రి, దర్శకుడు రాజనాల, ఇతర నటీనటులు తమ అద్భుతమైన నటనతో నగరవాసులను మంత్రముగ్ధులను చేశారు. శ్రీకృష్ణుడి పాత్రధారి డాక్టర్.సూలపాణి మాట్లాడుతూ తాను సర్జన్ డాక్టర్ అయినప్పటికీ నాటక కళా రంగం అంతరించిపోకుండా ఉండాలని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పౌరాణిక పద్య నాటకమును ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధ, నీలిమ, మునిపల్లె శ్రీనివాస్, భరద్వాజ్, రామస్వామి పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

మన్సూరాబాద్, జూన్ 3: మహా గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరిట ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంగీత విశ్వ విద్యాలయాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలో సోమవారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య, చిమ్మపూడి, మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

28 టేబుళ్లు .. 21 రౌండ్లలో కౌంటింగ్

ఎల్బీనగర్ , జూన్3: మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల కౌంటింగ్ పక్రియ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం నుంచి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జరగనుంది. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకుడు మహ్మద్ అహ్మద్ ఖాద్రీ పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రారంభం కానున్నది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకున్నామని అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో మొత్తం 24 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ పక్రియ నిర్వహించనున్నారు.

ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్..

ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రెండు హాళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో హాల్‌లో 14 టేబుళ్ల చొప్పున మొత్తం 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పోలైన ఓట్లను 21 రౌండ్లలో లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కౌంటింగ్ సిబ్బందికి రెండు విడుతల ట్రైనింగ్ పూర్తి చేసిన అధికారులు సోమవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. మంగళవారం ఉదయం కౌంటింగ్ పక్రియ ప్రారంభం అవుతుంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు కౌంటింగ్ పక్రియపై ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల కౌంటింగ్ పక్రియకు అన్ని ఏర్పాట్లు చేశాం. మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలోని ఎల్బీనగర్ నియోజకవర్గం అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికల కౌంటింగ్ పక్రియ కోసం కౌంటింగ్ సెంటర్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. కౌంటింగ్ సిబ్బందికి రెండు విడుతల శిక్షణ పూర్తి చేశాం. ఈవీఎంలు సరూర్‌నగర్ కౌంటింగ్ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచాం. ఉదయం కౌంటింగ్ పక్రియ ప్రారంభమవుతుంది.

–అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ

క్రీడలతో మానసికోల్లాసం

విజేతలకు కప్పును అందజేస్తున్న దావుద్

కందుకూరు, జూన్ 3 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదమని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ దావుద్ తెలిపారు. మండల పరిధిలోని బైరాగిగూడలో నిర్వహించిన బీపీఎల్ (బైరాగిగూడ ప్రీమియర్ లీగ్) వాలీబాల్ క్రీడల ముగింపు సందర్భంగా విజేతలుగా నిలిచిన టైగర్ టీం,క్యాప్టెన రమేశ్, రన్నర్‌గా నిలిచిన ప్రణీత్ కుమార్ టీంకు, కప్పులతో పాటు రూ. 21వేలను ఇమ్రాన్, రన్నర్ జట్టుకు రూ, 11వేలను కట్టెల శ్రీకాంత్ అందజేశారు. కార్యక్రమంలో స్పాన్సర్ ఎలిమినేటి దేవేందర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్,మాజీ వార్డు మెంబర్లు మైసయ్య, శివ ప్రసాద్‌గౌడ్, ఎంపైర్లు గుల్వి భగవన్, నాగార్జున, యువకులు క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం

మలక్‌పేట, జూన్ 3: షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి బేకరీ దగ్ధమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్ చౌరస్తాలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ..మూసారాంబాగ్ చౌరస్తాలోని రెడ్ రోజ్ బేకరీని నిర్వాహకుడు అహ్మద్ యథావిధిగా ఆదివారం రాత్రి పదిగంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. కాగా సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో బేకరీలో నుంచి పొగలు రావటాన్ని గమనించిన స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించగా వారు మలక్‌పేట అగ్నిమాపక కేంద్రానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఫైరింజన్, సిబ్బందితో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది ఐదు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. అప్పటికే బేకరీలోని సామగ్రి అంతా కాలి బూడిదైంది. సుమారు రూ. 2 నుంచి 3 లక్షల విలువైన సామగ్రి కాలిపోయిందని నిర్వాహకుడు అహ్మద్ తెలిపారు. అయితే షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక కేంద్రం అధికారులు తెలిపారు.

బాధిత కుంటుంబాలను ఆదుకుంటాం

కందుకూరు, జూన్ 3 : మృతుల కుంటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లేమూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎలుక శ్రీధర్‌రెడ్డి, పొలోజు లక్ష్మయ్య మృతి చెందిన విషయాన్ని పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఆమె గ్రామానికి వచ్చి వారి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు సమర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుంటుంబాలు ఆధైర్యపడవద్దని కోరారు. పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పరంజోతి, గణేశ్, ఎలుక సంజీవరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సురుసాని కొండల్‌రెడ్డి,సుకుమార్, జైపాల్,మల్లేశ్ ఉన్నారు.

శ్రీదుర్గానగర్ కాలనీని అభివృద్ధి చేయండి

కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీదుర్గానగర్ కాలనీవాసులు

హయత్‌నగర్, జూన్ 3 : డివిజన్ పరిధిలోని శ్రీదుర్గానగర్ కాలనీ అభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందించాలని శ్రీదుర్గానగర్ కాలనీవాసులు, హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలోని పలు వీధుల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్ సౌకర్యం కల్పించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి పటిష్టమైన ప్రణాళికతో దశలవారీగా కాలనీ అభివృద్ధికి చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సైదులు, కాలనీవాసులు వెంకట నారాయణ, రవి, బీరప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ జడ్జి పరీక్షలకు ఉచిత శిక్షణ

సైదాబాద్, జూన్ 3 : జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలు రాసే ఔత్సాహిక ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు మంగళవారం నుంచి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు నోటిఫికేషన్ జారీ చేసిందని, జూలై నెలలో ప్రవేశ పరీక్షలో ఉందని తెలిపారు. అందుకోసం గడ్డిఅన్నారం కల్యాణ్‌నగర్‌లోని తన కార్యాలయ ఆవరణలో నిపుణుల ద్వారా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు rapolubhaskarlaw@gmail,comకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

వనస్థలిపురం, జూన్ 3 : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని వివేకానంద కాలనీలో పర్యటించారు. కాలనీవాసులను నేరుగా కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. త్వరలోనే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, భ్రమరాంబ, ముత్యాలు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ప్రతిపాదించిన చిహ్నాంను ఏర్పాటు చేయాలి

కందుకూరు, జూన్ 3 : రాజముద్రపై ధర్మ సమాజ్ పార్టీ ప్రతి పాదించిన చిహ్నాంను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రవీందర్, జిల్లా కన్వీనర్ అమరేందర్ కోరారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. శేఖర్, రంజిత్,ఇబ్రహీం,శేఖర్, నాయకులు అంజయ్య, మహిపాల్,శ్రీకాంత్,మనోక్, ఎట్టయ్య పాల్గొన్నారు.

నూతన నియామకం

ఆర్కేపురం, జూన్ 3 : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యులు అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేసి నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనమీద నమ్మకంతో అప్పగించిన ఈ పదవికి తగిన న్యాయం చేస్తానన్నారు.